సాక్షి వరంగల్

ఆదివారం | 18 | ఫిబ్రవరి | 2024

మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు



మేడారంలో మొక్కులు

మేడారం జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివెళ్లారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు చేసి సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్నారు. ఎత్తుబంగారం, చీరసారె, పసుపుకుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లగా చూడాలని వనదేవతలను వేడుకున్నారు. మేకలు, కోళ్లను బలిచ్చారు.

- ఏటూరునాగారం/ఎస్ఎస్ తాడ్వాయి



- వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

రేపటి ప్రజావాణి రద్దు

కరీమాబాద్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనాపరమైన కారణాల (మేడారం మహా జాతర విధులు)తో ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించి ఫిర్యాదులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని కలెక్టర్ కోరారు.

అదనపు కలెక్టర్ సంధ్యారాణి బాధ్యతల స్వీకరణ



కరీమాబాద్ : జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా గట్టు సంధ్యారాణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీఓ వాసుచంద్ర, పరిపాలనాధికారి శ్రీకాంత్, కార్యాలయ పర్యవేక్షకులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ కలెక్టర్ సలహాలు, సూచనలు పాటిస్తూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమర్థవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు.

ఫిజిక్స్ ఒలింపియాడ్‌కు ఉపాధ్యాయుడు సురేష్



ఖానాపురం : మైసూర్ ఆస్ట్రానమీ ఫిజిక్స్ ఒలింపియాడ్‌కు బుధరావుపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సురేష్ ఎంపికయ్యారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్, ఓమీబాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్, స్వామి వివేకానంద యూత్ మూమెంట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆస్ట్రానమీ ఒలింపియాడ్ ఎక్స్‌పోజర్ క్యాంప్‌నకు ఫిజికల్ స్కూల్ అసిస్టెంట్ సుతారి సురేష్ ఎంపికైనట్లు డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఖగోళశాస్త్రంపై అధ్యయనం చేయనున్నట్లు వెల్లడించారు. ఈనెల 19 నుంచి 22 వరకు మైసూర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్‌లో నిర్వహించే ప్రతిష్ఠాత్మకమైన ఒలింపియాడ్‌లో ఆయన పాల్గొనున్నట్లు వారు తెలిపారు.

ఎల్గూర్‌గుట్టలో ఎలుగుబంటి!

భయాందోళనలో రైతులు, ప్రజలు

సంగెం : ఎల్గూర్‌స్టేషన్, నర్సానగర్ పరిసరాల్లోని ఎల్గూర్‌గుట్ట ప్రాంతంలో వారం రోజులుగా ఎలుగుబంటి సంచరిస్తోందని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నాలుగు రోజుల క్రితం రాత్రిపూట నర్సానగర్ గ్రామానికి చెందిన రొట్టె వెంకటేశ్వర్లుకు ఎలుగుబంటి కనిపించడంతో భయంతో ఇంటికి పరుగులు తీశాడు. శనివారం తెల్లవారుజామున జాటోత్ తండాకు చెందిన జుమ్మిలాల్‌కు మొక్కజొన్న చేలో ఎలుగుబంటి కనిపించిందని రైతులు, గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికే పలువురి మొక్కజొన్న పంటలు బాగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క కోతులు, మరో పక్క ఎలుగుబంటి పంట చేలను నాశనం చేస్తున్నాయని, ఎలుగుబంటి భయంతో వ్యవసాయబావుల వద్దకు కావలి వెళ్లేందుకు వణికిపోతున్నారు. అటవీశాఖ అధికారులు ఎలుగుబంటిని బంధించాలని రైతులు కోరుతున్నారు.

కక్షిదారులు రాజీ కుదుర్చుకోవాలి

వరంగల్ లీగల్: జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు తమ వీలును బట్టి కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని హనుకొండ ఇన్‌చార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, రెండో అడిషనల్ జడ్జి బి.శ్రీదేవి సూచించారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం.. శనివారం హనుమకొండ జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. హనుమకొండ, పరకాల కోర్టుల్లో లోక్ అదాలత్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగు క్రిమినల్, మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, వివాహ, కుటుంబ తగాదా, బ్యాంకు, చెక్ బౌన్స్, ఎలక్ట్రిసిటీ, చిట్ ఫండ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇన్సూరెన్స్, ఎక్సైజ్, విద్యుత్ చోరీ, కన్జ్యూమర్ ఫోరం, ట్రాఫిక్ ఈచాలన్, ప్రి లిటిగేషన్ కేసులు, ఇతర రాజీపడదగు కేసులు ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించుటకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగు కక్షిదారులు తమ కేసుల వివరాలను సంబంధిత కోర్టుల్లో తెలియపర్చి, రాజీ కుదుర్చుకోవాలని కోరారు. రాజీపడదగు కక్షిదారులు తమ న్యాయవాదులతో కోర్టులకు నేరుగా హాజరు కావాలని సూచించారు. సమావేశంలో హనుమకొండ న్యాయమూర్తి బి.శ్రీనివాస్, డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జ్ కార్యదర్శి జె.ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు సాత్విక్



సాత్విక్‌ను అభినందిస్తున్న హెచ్ఎం, టీచర్లు

చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కల్లెపు సాత్విక్ జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు టి.జయ తెలిపారు. పాఠశాలలో శనివారం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఫిజికల్ సైన్స్ ఫోరం, బయోలాజికల్ సైన్స్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో చెన్నారావుపేట హైస్కూల్‌లో శనివారం మండలస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారని అన్నారు. ఇందులో 8వ తరగతి విభాగంలో లింగాపురం ఉన్నత పాఠశాల విద్యార్థి వినయ్ ప్రథమ స్థానం, 9వ తరగతి విభాగంలో కల్లెపు సాత్విక్ ప్రథమ స్థానం, రెడ్డబోయిన కీర్తన ద్వితీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. అభినందించిన వారిలో సైన్స్ ఉపాధ్యాయులు రాగి శోధర్, పిన్నింటి బాలాజీరావు, చిదురాల మాధవి, గజవెల్లి సుందర్, కృష్ణ, మోహన్‌రావు, చింతకింది ఇందిర ఉన్నారు.

పెరట్లో గంజాయి సాగు!

- వరంగల్ ఎస్ఆర్ఆర్‌తోట, ఉర్సు కరీమాబాద్‌లో తోటలు
- విత్తనాలతోపాటు ఆర్థిక సాయం అందిస్తున్న స్మగ్లర్లు
- దాడులు చేసిన నార్కోటిక్స్, మిల్స్‌కాలనీ పోలీసులు
- మొక్కలు ధ్వంసం.. ఇద్దరిపై కేసులు నమోదు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి (ఫైల్)

ఖిలా వరంగల్ : గ్రామీణ ప్రాంతాల్లోనే కాదు.. ఇప్పుడు నగరంలోని పలు ప్రాంతాల్లో కొందరు యథేచ్ఛగా గంజాయి సాగుచేస్తున్నారు. భవనాల పైన, ఖాళీ స్థలాలు, ఇంటి పెరట్లో ఈ మొక్కలు పెంచుతున్నారు. వరంగల్ రైల్వేగేట్ ఎస్ఆర్ఆర్ తోటలో జిలానీ అనే వ్యక్తి తన ఇంటి పెరట్లో గంజాయి సాగు చేసి ఇటీవల పోలీసులకు చిక్కాడు. పోలీసులు కేసు నమోదు చేసి అతడిని జైలుకు పంపించారు. బిహార్ వాసి మహ్మద్ జమీర్ అన్సారీ ఉర్సు కరీమాబాద్‌లో అద్దెకున్న ఇంటిలో గంజాయి సాగు చేస్తుండగా పోలీసులు దాడులు చేశారు. కిలోన్నర ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఐదు గంజాయి మొక్కలను ధ్వంసం చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ ఘటనలను బట్టి చూస్తే నగరంలో విచ్చలవిడిగా గంజాయి సాగవుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసుల నిఘా లోపంతోనే గంజాయి విక్రయాలు, సాగవుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

సాగుకు స్మగ్లర్ల చేయూత..

వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో కొంతమంది తమ ఇంటి పెరట్లో, ఇంటిపైన పూల కుండీలు, ఖాళీ స్థలాల్లో పూల మొక్కలతోపాటు గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం. కూరగాయలు, ఆకుకూరలు, పూల మొక్కలు పెంచాల్సిన స్థలంలో ఇంటి యజమానులను కొందరు గంజాయి సాగుకు ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. యువత, విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను నాశనం చేస్తున్న గంజాయి విక్రయ ముఠా సభ్యులే గంజాయి విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. 'బంతి తోట మాదిరిగానే పెంచడం సులభం..ఎవరికి కనిపించకుండా సాగు చేయండి.. పెద్దఎత్తున లాభాలు మీకు ఇస్తామని' నమ్మించి సాగుకు ఆర్థిక చేయూత ఇస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా కరీమాబాద్ ఎస్ఆర్ఆర్‌తోట, ఉర్సు కరీమాబాద్, రంగశాయిపేట, శంభునిపేట ప్రాంతాల్లోని భవనాలు, ఇంటి పెరడు, ఖాళీస్థలాలు, ప్రహరీల నడుమ ఆకుకూరలు, కూరగాయల తోటల మాటున గంజాయిని పండిస్తున్నట్లు తెలుస్తోంది.

కరీమాబాద్‌లో దాడులు

బిహార్‌కు చెందిన మహ్మద్ జమీర్ అన్సారీ వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని ఓ ఇంట్లో 15 ఏళ్లుగా అద్దెకు ఉంటున్నాడు. ఇంటిపెరట్లో సాగు చేస్తున్న గంజాయి తోటపై శనివారం హైదరాబాద్ నార్కోటిక్స్, మిల్స్‌కాలనీ పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. గంజాయి మొక్కలను అధికారులు పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని సాగుచేసిన గంజాయి మొక్కలను ధ్వంసం చేసి, కిలోన్నర ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల ఎస్ఆర్ఆర్‌తోటలో పట్టుబడిన వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు ఉర్సు కరీమాబాద్ ప్రాంతంలో గంజాయి సాగు బయటపడినట్లు తెలుస్తోంది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పక్కా సమాచారం.

గంజాయి సాగును ఉపేక్షించం..



స్టేషన్ పరిధిలో గంజాయి సాగుచేసే నిందితులపై కేసు నమోదు చేశాం. మత్తుపదార్థాల అక్రమ రవాణా, గంజాయి విక్రయాలు, బెల్ట్ షాపులపై పటిష్ఠమైన నిఘా ఏర్పాటు చేశాం. పట్టుబడిన వారిని ఉపేక్షించకుండా కేసులు నమోదు చేస్తున్నాం. నేర ప్రవృత్తి మార్చుకోకుండా నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితులోనూ వదిలిపెట్టం. గంజాయి విక్రయిస్తూ రెండోసారి పట్టుబడితే ప్రాంతం నుంచి బహిష్కరిస్తాం. మళ్లీమళ్లీ అదే తరహా నేరాలు చేస్తే పీడీ యాక్ట్ పెడతాం.

- పి.మల్లయ్య, ఇన్‌స్పెక్టర్ మిల్స్‌కాలనీ వరంగల్

విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపాలి

- జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

వరంగల్ చౌరస్తా : పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల్లో మానసిక ధైర్యాన్ని నింపి, ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధం చేయించాలని జిల్లా విద్యాశాధికారి వాసంతి సూచించారు. గ్రేటర్ వరంగల్ 27వ డివిజన్‌లోని కృష్ణాకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పేరెంట్స్, టీచర్స్ సమావేశం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా డీఈఓ హాజరై మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు, ఉన్నత చదువులకు అవకాశాలు, పరీక్షలకు తగిన ప్రణాళికతో సిద్ధం తదితర అంశాలను వివరించారు. విద్యార్థులు పౌష్టిక, తేలికైన ఆహారం తీసుకునేలా చూడాలన్నారు. విద్యార్థులను నేషనల్ మీన్స్ కం మెరిట్ లాంటి పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. మోటివేషన్, పరీక్షలు ఎలా రాయాలి, మెళకువలను డైట్ విశ్రాంత అధ్యాపకుడు సోమయ్య వివరించారు. సమావేశంలో జిల్లా పరీక్షల బోర్డు కార్యదర్శి కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు భూపాల్, అఫ్సర్, భవాని, మస్నా, రమేష్, ఉమేష్, రవికుమార్, కరుణ, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ప్రణీత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'వడుప్సా' సేవలు ప్రశంసనీయం

- ఓరియంటేషన్ తరగతులు విద్యార్థులకు మేలు
- అదనపు కలెక్టర్ అశ్వినితానాజీవాకడే



అదనపు కలెక్టర్ అశ్వినితానాజీవాకడేను సన్మానిస్తున్న వడుప్సా బాధ్యులు

కరీమాబాద్ : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం వడుప్సా నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే అన్నారు. ఉర్సు గుట్టలోని నాని గార్డెన్‌లో శనివారం వడుప్సా ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం స్టేట్ రిసోర్స్ పర్సన్స్ నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి వడుప్సా జిల్లా అధ్యక్షుడు అంకటి వీరస్వామి అధ్యక్షత వహించగా అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. ప్రణాళికాబద్ధంగా చదివినప్పుడే మంచి మార్కులు సాధిస్తారని, విద్యార్థులకు ఇలాంటి ఓరియంటేషన్ తరగతులు ఉపయోగపడుతాయని తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో వరంగల్ జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని, విద్యార్థులు 10/10 జీపీఏ సాధించాలని డీఈఓ వాసంతి పేర్కొన్నారు. ఎలాంటి ఒత్తిడికి గురవకుండా విద్యార్థులు పరీక్షలు రాయాలని ఎంఈఓ విజయ్ కుమార్ సూచించారు. కాగా, జిల్లాలోని 70 పాఠశాలల నుంచి 1500 మంది విద్యార్థినీవిద్యార్థులు హాజరయ్యారు. వడుప్సా జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆడెపు శ్యాం, జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లా రవి, జ్ఞానేశ్వర్‌సింగ్, వెంకటేశ్వర్‌రావు, శ్రీధర్, చక్రపాణి, సతీష్‌కుమార్, కూచన క్రాంతికుమార్, రాజు, వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, రవీందర్, సతీష్ మూర్తి, మోహన్, మాధవి, కవిత, వెంకట్రాజం, రవి, శరత్‌బాబు, చందర్‌బాబు, గోవిందరాజులు, యుగేంధర్‌రాజు, విద్యాసాగర్, ఇనాయత్, ఖలీల్, సమీర్, భాస్కర్, సుగుణాకర్, పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాల్వలో దూకి యువకుడి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన గీసుకొండ పోలీసులు



రమేశ్‌ను కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించిన గీసుకొండ పోలీసులు

గీసుకొండ : కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకునేందుకు కాకతీయ కాల్వలోకి దూకి నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుండగా గీసుకొండ పోలీసులు రక్షించారు. ఇన్‌స్పెక్టర్ బాబూలాల్ కథనం ప్రకారం.. గ్రేటర్ వరంగల్ నగరంలోని 16వ డివిజన్ ధర్మారానికి చెందిన పర్లపల్లి రమేశ్ శనివారం కొనాయమాకుల వద్ద గల ఎస్సారెస్పీ ప్రధాన (కాకతీయ) కాల్వలోకి దూకాడు. నీటిలో కొట్టుకుని పోతుండగా స్థానికుల సమాచారం మేరకు పెట్రోకార్ సిబ్బంది వెంకన్న, దేవేందర్ వెంటనే అప్రమత్తమై గుడిసెవాసులు పెండ్యాల మల్లేశ్, దండు అనిల్, కొమ్ము సంపత్ సాయంతో తాడు అందించి కాపాడారు. రమేశ్‌కు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ బాబూలాల్ రక్షించిన పోలీసు సిబ్బంది, గుడిసెవాసులను అభినందించారు.

పంట చేనులో భౌభౌ..!

- పక్షులు, పందుల బెడద నివారణకు ఓ రైతు వినూత్న ఆలోచన
- మొక్కజొన్న చేను రక్షించుకునేందుకు మైక్ ఏర్పాటు



మొక్కజొన్న చేనువద్ద పక్షులు రాకుండా మైక్‌ను ఉపయోగిస్తున్న రైతు

గీసుకొండ : ఓ రైతు మొక్కజొన్న చేనులో కుక్క అరుపులు.. భౌభౌ అంటూ రికార్డు చేసిన మైక్‌ను ఆయన ఏర్పాటు చేశాడు. ఉదయం పూట చిలకలు, రాత్రి అడవి పందులబారి నుంచి పంటను రక్షించుకునేందుకు వినూత్నంగా ఆలోచించాడు. మండలంలోని ఆరెపల్లికి చెందిన బూర్గుల నరేశ్ తన రెండు ఎకరాల భూమిలో మొక్కజొన్న సాగు చేశాడు. చేనులో కంకులు పాలు తొడిగి గింజ ముదిరే దశలో పిట్టలు, అడవి పందుల బెడద తీవ్రమైంది. వాటి బారి నుంచి చేనును రక్షించడానికి ఆయన ఆలోచన మంచి ఫలితాలను ఇస్తోంది. భౌభౌ అంటూ ఉదయం, రాత్రి పూట అప్పటికే రికార్డు చేసిన మైకు పంట చేనులో మోత మోగుతోంది. దీంతో పక్షులు, అడవి పందులు దరికి చేరడం లేదని రైతు తెలిపారు.

జూపార్కుకు త్వరలో పెద్దపులి



జూపార్కులో పక్షుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ పర్గెయిస్

కరీమాబాద్: వరంగల్ కాకతీయ జూపార్కులో సందర్శన కోసం త్వరలో పెద్ద పులి, అడవి దున్న, మరో రెండు రకాల జింకలను అందుబాటులో ఉంచనున్నట్లు చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఎంసీ. పర్గెయిన్ తెలిపారు. జూపార్కులో సౌకర్యాలు, జంతువుల సంఖ్యను పెంచాలని ఇటీవల అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఈనేపథ్యంలో శనివారం పర్గెయిస్ ప్రస్తుతం జూ పార్కులో ఉన్న సౌకర్యాలు, అదనపు ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షించారు. కొత్తగా ఏర్పాటు చేసిన పక్షుల కేంద్రాన్ని, బ్యాటరీ వాహనాన్ని ప్రారంభించారు. పాకాల అభయారణ్యం అభివృద్ధి, సౌకర్యాలపై అధికారులతో సమీక్షించారు. అదేవిధంగా గూడూరు అటవీ డివిజన్ పులిమడుగు వద్ద ఎకో టూరిజం క్యాంపింగ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో చీఫ్ కన్జర్వేటర్ భీమానాయక్, వరంగల్ డీఎఫ్ఓ భూక్యా లావణ్య, గూడూరు, మహబూబాబాద్ డివిజన్ అటవీ అధికారులు చంద్రశేఖర్, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

'గ్రేటర్'కు కొత్త పోలీస్ టీం

ఏసీపీలు, ఎస్‌హెచ్ఓలకు తప్పని స్థానచలనం..

- బదిలీలు, పోస్టింగ్‌లపై 'కాంగ్రెస్' మార్కు
- భూ ఆక్రమణలు, సెటిల్‌మెంట్లకు కేరాఫ్ పలు ఠాణాలు
- ఈ నేపథ్యంలోనే హాట్‌కేకుల్లా 'గ్రేటర్' పోస్టింగ్‌లు
- ఇవే ఆరోపణలపై గతంలో పలువురిపై సస్పెన్షన్ వేటు
- వేచిచూసే ధోరణిలో పోలీసు ఉన్నతాధికారులు



సాక్షిప్రతినిధి, వరంగల్: భూదందాలు, సెటిల్‌మెంట్లకు కేరాఫ్‌గా మారిన గ్రేటర్ వరంగల్‌లోని పలు ఠాణాలకు కొత్త టీం వచ్చింది. ప్రధానంగా వరంగల్ నగరం, శివారు పోలీస్ స్టేషన్లకు స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్‌హెచ్ఓ)లు మారారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మారి కాంగ్రెస్ సర్కారు వచ్చిన నేపథ్యంలో ఆ మరుసటి రోజునుంచే ఉన్న పోస్టింగ్‌లను కాపాడుకునేందుకు కొందరు.. ఉన్న వారిని కదిలించి ఆ ఠాణాల్లో తిష్ట వేసేందుకు మరికొందరు పోటాపోటీగా ప్రయత్నాలు చేశారు. ఇందులో ఆర్థికబలం, రాజకీయ అండ ఉన్న చాలామంది సక్సెస్ కాగా.. ఆ పరుగుపందెంలో దూసుకెళ్లలేని చాలా మందికి మళ్లీ లూప్‌లైన్ పోస్టింగ్‌లే తప్పనిసరి అయ్యాయి. వాస్తవానికి భూదందాలు, సెటిల్‌మెంట్ల వివాదాలతో గతంలో నగరంలో పలువురు ఎస్‌హెచ్ఓలు, సీఐలు, ఏసీపీలపై సస్పెన్షన్, బదిలీ వేటు పడింది. ఈ నేపథ్యంలోనైనా 'ఆ వివాదాల ఠాణాలు మనకెందుకులే' అనుకుంటారనుకుంటే..వాటికే ఎక్కువమంది పోటీ పడి పోస్టింగ్‌లు పొందడంపై చర్చ జరుగుతోంది.

పోస్టింగ్‌లపై కాంగ్రెస్ మార్కు.. పోలీసువర్గాల్లో చర్చ..

సార్వత్రిక ఎన్నికల తర్వాత గ్రేటర్ వరంగల్ పరిధిలో పెద్దమొత్తంలో బదిలీలు జరిగాయి. ప్రధానంగా పోలీసుశాఖలో ఏసీపీలు, ఎస్‌హెచ్ఓల బదిలీలు ప్రక్రియ ప్రాధాన్యతను సంతరించుకుంది. మొదట బదిలీలు.. ఆ తర్వాత రద్దు.. మళ్లీ బదిలీలు, పోస్టింగ్‌ల వ్యవహారం నేపథ్యంలో రాజకీయ పలుకుబడి, పైరవీలు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల మార్కు స్పష్టంగా కనిపిస్తుందన్న చర్చ అన్ని వర్గాల్లో జరుగుతోంది. ఈ నెల 12న రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఏసీపీల బదిలీల్లో మామునూరు ఏసీపీ సి.సతీష్‌బాబును డీజీపీ ఆఫీస్‌కు బదిలీ చేసి ఆ స్థానంలో కొత్తగూడెం ఏసీపీ అబ్దుల్ రహ్మాన్‌ను నియమించారు. అదేవిధంగా నర్సంపేట ఏసీపీ పి.తిరుమల్‌ను వరంగల్ ట్రాఫిక్ ఏసీపీగా బదిలీ చేసి అక్కడున్న ఎం.భోజరాజును రామగుండం సీసీఎస్‌కు బదిలీ చేశారు. కాజీపేట ఏసీపీ పి.డేవిడ్ రాజును కరీంనగర్ పీటీసీ డీఎస్పీగా నియమించి, కాజీపేటకు ఎవరినీ ఇవ్వలేదు. రెండు రోజుల తర్వాత (14న) మాడిఫికేషన్ చేస్తూ మామునూరు ఏసీపీగా నియమించిన ఎస్‌కే అబ్దుల్ రహ్మాన్‌ను కొత్తగూడేనికి తిరిగి పంపి, ఏసీపీగా మళ్లీ సి.సతీష్‌బాబును కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వరంగల్ ట్రాఫిక్ ఏసీపీగా నియమితులైన పి.తిరుమల్‌ను ఆ ఉత్తర్వు రద్దు చేసి కాజీపేట ఏసీపీగా నియమించారు. అదేవిధంగా 15 రోజుల వ్యవధిలో నాలుగైదు ఉత్వర్వుల ద్వారా సుమారు 42 మంది ఎస్‌హెచ్ఓలు, ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఇందులో బదిలీ ఉత్తర్వులు అందిన ఐదుగురిని విధుల్లో చేరవద్దని మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. ఆ తర్వాత మళ్లీ వెలువడిన ఉత్తర్వుల్లో కొందరు ఇన్‌స్పెక్టర్లను అవే పోస్టింగ్‌ల్లో కొనసాగించగా, మరికొన్ని పోలీసుస్టేషన్లకు కొత్తవారిని నియమించారు. దీంతో ఈ వ్యవహారం వెనక అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ప్రమేయమే కారణమన్న చర్చ సర్వత్రా సాగుతోంది.

చర్చనీయాంశంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల కుర్చీలాట..

కోరుకున్న చోట కొలువు చేయాలనుకునే కొందరు సీఐలు ఆ ఠాణాల్లో ఖర్చీఫ్(లేఖ)లు వేసుకుని పోస్టింగ్‌ల సంపాదించిన తీరు పోలీస్‌వర్గాల్లోనే చర్చనీయాంశంగా మారింది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడి మరుసటిరోజు నుంచే వరంగల్ కమిషనరేట్ పరిధిలో పోస్టింగ్‌ల కోసం పోటాపోటీగా పావులు కదుపుకుంటున్నారన్న చర్చ ఉంది. ఒక ఇన్‌స్పెక్టర్ (ఎస్‌హెచ్ఓ) పదవీకాలం ఏడాదిన్నరైన పూర్తికాక ముందే ఆ పోస్టింగ్ కొట్టేందుకు వారి సహచరులే ప్రజాప్రతినిధులను కాకా పట్టిన వైనంపై బహిరంగంగానే మాట్లాడుకున్నారు. కీలక ఠాణాలు, సర్కిళ్లలో పోస్టింగ్‌ల కోసం సీఐల మధ్య 'కుర్చీలాట'సాగడం.. 15 రోజుల వ్యవధిలో జరిగిన బదిలీల ఉత్తర్వుల్లో 42 మంది వరకు అటు ఇటుగా మారారు. ఈ బదిలీల్లో కీలక ఠాణాలను దక్కించుకున్న పలువురు ప్రజాప్రతినిధుల లేఖలు పొందటమే కారణమన్న చర్చ జరుగుతోంది. ఇదే తంతును కొనసాగించేందుకు మిగిలిన కమలాపూర్, ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్ల కోసం కూడా చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నారు. కమలాపూర్, హైదరాబాద్ ఎస్ఐబీలో పనిచేస్తున్న ఒకరికి ఖాయమైనట్లు కూడా చెబుతున్నారు. ఇదిలా ఉంటే రాజకీయ అండ, సిఫారసులతో పోటాపోటీగా పోస్టింగ్‌లు పొందిన కొందరు అధికారుల వల్ల ప్రజాఫిర్యాదుల పరిష్కారం, వారికి న్యాయం చేసే విషయంలో పారదర్శకత ఉంటుందా? అన్న చర్చ జరుగుతుండగా, ఉన్నతాధికారులు మాత్రం వేచిచూసే ధోరణిలో ఉన్నారు.

డిప్యూటీ కమిషనర్ బదిలీ రద్దు

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ డిప్యూటీ కమిషనర్‌గా నియమితులైన ఎ.స్వామి తిరిగి వెనక్కి వెళ్లారు. ఇప్పటికే ముగ్గురు డిప్యూటీ కమిషనర్లు ఉండగా.. ముగ్గురు అధికారులున్నారు. అడిషనల్ కమిషనర్ రవీందర్ యాదవ్ మహబూబాబాద్‌కు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో కొత్తగూడెం కమిషనర్ స్వామిని ఇక్కడికి బదిలీ చేశారు.

పోలీస్ పెట్రో ఫిల్లింగ్ స్టేషన్‌కు అవార్డులు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ పోలీస్ వెల్ఫేర్ సొసైటీ వరంగల్ కాకతీయ ఫిల్లింగ్ స్టేషన్ మూడు అవార్డులను కైవసం చేసుకుందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ప్రతీ ఏడాది భారత్ పెట్రోలియం సంస్థ డీలర్స్‌కు ప్రకటించే అవార్డుల్లో భాగంగా ఈ ఏడాది పెట్రో ఫిల్లింగ్ స్టేషన్ నిర్వహణలో కాకతీయ ఫిల్లింగ్ స్టేషన్ ఉత్తమంగా నిలిచిందని తెలిపారు. అవార్డులతో పాటు చాంపియన్ ఆఫ్ చాంపియన్స్ షీల్డ్‌ను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా పెట్రో ఫిల్లింగ్ స్టేషన్ ఇన్‌చార్జ్ నరేంద్ర, హెడ్ కానిస్టేబుల్ రమేశ్, కానిస్టేబుల్ ప్రభాకర్‌రెడ్డికి సీపీ జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

ఆర్టీసీ సర్వసన్నద్ధం

నేటి నుంచి ప్రత్యేక బస్సులు ప్రారంభం

21, 22, 23, 24వ తేదీల్లో జాతర

- మేడారానికి 6వేల సర్వీసులు..
- 15 వేల మంది సిబ్బంది సేవలు

హన్మకొండ : ఆసియాఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఆర్టీసీ సర్వసన్నద్ధమైంది. ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తూ గత జాతర వైఫల్యాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఏర్పాట్లు చేసింది. ఈ నెల 21, 22, 23, 24 తేదీల్లో వన దేవతల జాతర జరుగనుంది. ఈ నేపథ్యంలో భక్తులను చేర వేసేందుకు ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఆ తర్వాత భక్తుల రాకపోకలను బట్టి బస్సులు నడిపేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి బస్సులు నడిపేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ సారి జాతరకు ఆర్టీసీ బస్సుల ద్వారా 40 లక్షల వరకు భక్తులు ప్రయాణం చేస్తారని అధికారులు అంచనా వేసి ప్రణాళికలు రూపొందించారు. ఈ జిల్లాల నుంచి మొత్తం 51 ప్రత్యేక పాయింట్ల నుంచి 6 వేల బస్సుల ద్వారా భక్తులను మేడారానికి చేరవేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 31 ప్రత్యేక పాయింట్లు, ఇతర జిల్లాలో 20 ప్రత్యేక పాయింట్ల నుంచి భక్తులను చేరవేస్తారు. ఆర్టీసీ వరంగల్ రీజియన్ నుంచి 2,500 బస్సులు, కరీంనగర్ రీజియన్ నుంచి 750, ఖమ్మం నుంచి 500, ఆదిలాబాద్ నుంచి 400, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మహారాష్ట్రలోని సిరొంచ నుంచి మిగతా ప్రత్యేక బస్సులు మేడారానికి నడుపుతారు.

15 వేల మంది సిబ్బంది విధులు

మేడారం జాతరలో అధికారులు, సూపర్ వైజర్లు, కార్మికులు, ఇతర సిబ్బంది కలిపి మొత్తం 15 వేల మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఇందులో 200 మంది అధికారులు, 4 వేల మంది కండక్టర్లు, 12 వేల మంది డ్రైవర్లతో పాటు సూపర్‌వైజర్లు, టీటీఐలు, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లు, ఎంఎఫ్‌లు, ఎంసీలు, సెక్యూరిటీ ఉద్యోగులు, మెకానిక్‌లు, ఎలక్ట్రీషియన్స్, హెల్పర్స్, శ్రామిక్స్, సెక్షన్ ఆఫీసర్స్, సివిల్ ఏఈలు విధులు నిర్వహిస్తారు.



హనుమకొండలోని కుడా (హయగ్రీవాచారి) మైదానంలో సిద్ధమైన మేడారం ప్రత్యేక బస్ పాయింట్

20 ఎకరాల్లో తాత్కాలిక బస్ స్టేషన్

మేడారంలో 55 ఎకరాల స్థలంలో ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది. గతంలో 40 ఎకరాల స్థలంలో ఏర్పాట్లు చేయగా ఈ సారి మరో 15 ఎకరాలు అదనంగా సేకరించారు. 35 ఎకరాల్లో బస్సుల పార్కింగ్, మరమ్మతులకు షెడ్, కార్మికులకు వసతి, అధికారులకు వసతి, తాగు నీటి సౌకర్యం, మరుగుదొడ్ల ఏర్పాట్లు చేశారు. 20 ఎకరాల్లో తాత్కాలిక బస్ స్టేషన్, భక్తులు బస్సులోకి చేరేందుకు రేయిలింగ్ ఏర్పాటు చేశారు.

10 ప్రైవేటు పెట్రోల్ బంకులు లీజ్..

ఆర్టీసీ బస్సుల్లో ఇంధనం నింపేందుకు మేడారం రూట్‌లో 10 ప్రైవేటు పెట్రోల్, డీజిల్ బంకులను లీజ్‌కు తీసుకున్నారు. ఒగ్లాపూర్, మల్లంపల్లిలో 2, జంగాలపల్లి, చెల్పూరు, జవహర్‌నగర్, చిన్నబోయినపల్లి, గోవిందరావు పేట, ఇంచెర్లతో పాటు ఖమ్మం రూట్‌లో మరో ప్రైవేటు పెట్రోల్ బంకులు లీజ్‌కు తీసుకున్నారు. మేడారం దారిలో నాలుగు చోట్ల వాహన మరమ్మతు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. మేడారం, తాడ్వాయి, పస్రా, గట్టమ్మ వద్ద ఈ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ ఆరుగురు మెకానిక్‌లు, ఇద్దరు ఎలక్ట్రీషియన్లు పని చేస్తారు. ఈ కేంద్రాలతో పాటు 12 మొబైల్ వ్యాన్లు, 6 మోటార్ సైకిల్ స్క్వాడ్స్, రెండు క్రేన్‌లు, ఒక ట్రాక్టర్‌ను సమకూర్చుకున్నారు. ప్రతి 20 కిలో మీటర్లకు ఒక పెట్రోలింగ్ స్టాఫ్ ఉంటుంది.

బస్ స్టేషన్ ప్రాంతంలో సీసీ కెమెరాలు

మేడారంలో ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రాంతంలో సీసీ కెమెరాలు బిగించి ఆర్టీసీ కమాండ్ కంట్రోల్ రూంతో పాటు పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు కూడా అనుసంధానించారు. కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రత్యేక బస్ పాయింట్లోనే సర్వే లైన్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. తిరుగు ప్రయాణంలో భక్తులను నేరుగా బస్సు ఎక్కించి తాడ్వాయిలో టికెట్‌లు ఇస్తారు. ఇక్కడ వేగంగా టికెట్లు జారీ చేసేందుకు 100 బ్యాచ్‌లతో 400 మంది కండక్టర్లు ఉంటారు. జాతరకు కొత్తగా 700 టిమ్‌లు అందుబాటులో ఉంచారు. తాడ్వాయి వద్ద స్టాటికల్ సిబ్బందిని ఉంచి ఎన్ని బస్సుల్లో ఎంత మంది భక్తులు వచ్చారో నివేదిక రూపొందించనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. మేడారం బస్ స్టేషన్‌లో భక్తులను అలరించేందుకుగాను రెండు భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

శుద్ధి చేసిన నీరు అందజేత


జాతరలో విధులు నిర్వహించే అధికారులు, ఉద్యోగులకు తాగు నీటి వసతి కోసం ఆర్టీసీ నాలుగు ఆర్ఓ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. మేడారం జాతర బేస్ క్యాంపు, తాడ్వాయి క్యాంపులో వీటిని ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బందితో పాటు బస్సు బోర్డింగ్ పాయింట్‌లో భక్తులకు శుద్ధి చేసిన నీటిని అందిస్తారు.

సురక్షితంగా ప్రయాణికుల చేరవేత



మేడారం జాతర భక్తులను సురక్షితంగా, సుఖవంతంగా చేరవేస్తాం. నైపుణ్యం కలిగిన డ్రైవర్లతోనే బస్సులు నడుపుతాం. ప్రయాణికులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి క్షేమంగా చేరుకోవాలి. బస్సులు కండీషన్‌గా ఉండేలా అన్ని చర్యలు తీసుకున్నాం. క్రమ పద్ధతిలో వెళ్లేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేశాం.

జాస్తి శ్రీలత, ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం





ఐదు జాతరల బస్సులు, ప్రయాణికుల వివరాలు

సంవత్సరాలు	2014	2016	2018	2020	2022
బస్సుల సంఖ్య	3,331	3,382	3,563	3,546	3845
నడిచిన బస్సుల ట్రిప్పులు	37963	41014	46815	50600	54566
ప్రయాణికుల చేరవేత (లక్షల్లో)	15.32	14.86	17.54	19.10	10.86
ఆదాయం రూ.కోట్లలో	21.00	24.16	26.46	30.07	21.81

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
హోల్‌సేల్ రేటు - 134/-
బ్రాయిలర్ చికెన్ రేటు - 220/-
స్కిన్‌లెస్ చికెన్ రేటు - 230/-
Cell: 9989299661

WANTED TEACHERS
MONTFORT SCHOOL-CBSE
Pre-Primary Mother Teacher: Graduate with Montessori or PPTTC.
PGT/TGT: All Subjects, Graduate with B.Ed.
Librarian: Graduate with M.Lib., B.Lib.
School Counsellor: Master's Degree in Psychology with Experience in counselling
Arts & Crafts: Graduate in the relevant subject
Dance & Music: Certification or Diploma in Dance/Music
IT: B.C.A./M.C.A. with Complete knowledge of Computers
PET: M.P.Ed./B.P.Ed.
Good Communication Skills are a Pre-Requisite
Interested applicants may forward their resume to: montfortkazipet@gmail.com
Submit in person at Montfort School-CBSE Fathimanagar, Kazipet, Hanamkonda.
For further details Contact: 79010 11255, 63034 74352
Note: Last date for receiving the applications is 22-02-2024

జంపన్న వాగు వద్ద స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



తల్లులకు భక్తుల పూజలు



గంట కొడుతున్న భక్తురాలు



తల్లులకు తనివితీరా మొక్కుతున్న చిన్నారి

ఏటూరునాగారం/ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారం సమ్మక్క, సారలమ్మను శనివారం భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మొదట జంపన్నవాగులో స్నానాలు ఆచరించి పుట్టు వెంట్రుకలు సమర్పించుకున్నారు. అనంతరం అమ్మవార్ల గద్దెలకు చేరుకుని చీరెసారె, పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం, కోళ్ల, యాటను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం చెట్ల కింద విడిది చేసి వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనలు చేశారు.

అమ్మవార్లకు ముస్లింల మొక్కులు

మహబూబాబాద్‌కు చెందిన ముస్లిం మహిళలు మేడారం సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్నారు. సాజాన్‌బీ, అక్రమ్ పాషా కుటుంబాలు అమ్మవార్లను దర్శించుకుని ఎత్తుబంగారం చెల్లించారు. అమ్మవార్ల కోర్కెలు తీరుస్తారనే నమ్మకంతో ఐదు జాతరల నుంచి మేడారం వస్తున్నామన్నారు. అమ్మవార్లను మొక్కితే శుభమే జరిగిందని, పిల్లల చదువు, ఇంటి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.

గంట బహూకరణ

బెంగుళూరుకు చెందిన కుంధవర్ బాబా.. తల్లుల సన్నిధికి గంటను బహూకరించారు. కోర్కెలు నెరవేరడంతో అమ్మవార్లకు గంటను బహూకరించినట్లు ఆయన తెలిపారు. తల్లులను నమ్మితే శుభమే జరుగుతుందన్నారు.

ఆకట్టుకుంటున్న కోయ హట్స్



ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలోని హరితహోటల్‌లో టూరిజంశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోయ హట్స్ (వనకుటీరాలు) ఆకట్టుకుంటున్నాయి. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వెదురు బొంగులు, అడవి గడ్డితో వనకుటీరాలు ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ చిత్రాలు పొందుపరిచి భక్తుల వీక్షణం కోసం ప్రదర్శనకు పెట్టారు.

ఆర్టీసీ కార్గో ద్వారా ఇంటికే మేడారం ప్రసాదం

హన్మకొండ: మేడారం సమ్మక్క, సారలమ్మ ప్రసాదం (బంగారం)ను భక్తుల ఇంటికి చేరవేసేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు దేవాదాయ శాఖ, ఆర్టీసీ ఒప్పందం చేసుకుంది. ఆర్టీసీ పార్శిల్, కార్గో సేవల ద్వారా ఈ సేవలు అందించనుంది. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు వన దేవతల జాతర జరగనుంది. ఈ నెల 25 తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే అవకాశాన్ని ఆర్టీసీ కల్పించింది. అమ్మవార్ల ప్రసాదంతోపాటు పసుపు, కుంకుమను ఆర్టీసీ పార్శిల్, కార్గో ద్వారా భక్తులకు చేరవేస్తారు. దీనికి గాను భక్తులు రూ.299 చెల్లించి సమీపంలోని కార్గో ఏజెంట్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వద్ద బుక్ చేసుకోవాలి. వివరాలకు, బుకింగ్ కోసం 91542 98759, 91542 98760, 91542 98761 నంబర్లలో సంప్రదించాలని ఆర్టీసీ అధికారులు కోరారు.

తల్లులకు హిజ్రాల ఒడిబియ్యం..



ఏటూరునాగారం: మండల కేంద్రం నుంచి హిజ్రాలు శనివారం మేడారం సమ్మక్క, సారలమ్మకు ఒడిబియ్యం తీసుకెళ్లారు. అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో పూజించి చీరెసారె సమర్పించారు. కాగా, హిజ్రాలు డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

షట్టర్ కిరాయికి ఇవ్వబడును
■ పిన్నింటి కాంప్లెక్స్ పద్మాక్షిగిరి వరంగల్ వాణిజ్య బ్యాంకు ఆర్థిక కార్యకలాపాలకు షట్టర్స్ కిరాయికు కలిసిన వసతులు, విశాలమైన కారు పార్కింగ్ కలదు. సంప్ర॥ 9441928908. [W-1200980]

PLOT FOR SALE
■ అతి చిన్న పెట్టుబడి రేపు అధిక రాబడి 121 చ॥గజాల ప్లాటు రూ. 2,40,000/- యాదగిరిగుట్ట దగ్గర @ ఆలేరు- EMI కలదు. ప్లాటు ఉంటే ఆర్థిక ఎదుగుదల, ఆత్మధైర్యం. సెల్: 8179608180. [W-1220985]
■ టేకులగూడెం రింగురోడ్ 1/2 కిలో మీటర్ సోమిడి కాజీపేట రోడ్‌లో 200 గజాలు 36x50 ప్లాటు అమ్మకానికి కలదు. సెల్: 9989545233. [W-1220974]
■ జనగాం జిల్లాకి అతి దగ్గరలో DTCP RERA approved చ.గ॥ 3600/- ఫాం లాండ్ చ.గ॥ 2100/- లాంచింగ్ ఆఫర్‌లో గలవు. ఈ ఆఫర్ కొద్ది రోజులు మాత్రమే త్వరపడండి. ఫోన్ 7416591078. [H-801477]
■ భువనగిరి-వరంగల్ హైవేకి & ఆలేరు టౌన్‌లో రెడీ టూ కన్‌స్ట్రక్షన్స్ YTDA & DTCP (RERA) అప్రూవ్డ్‌తో బ్యాంక్ సౌకర్యము. ఫోన్ 9866608313 / 9849178880. [HA-3650]

LAND FOR LEASE
■ మడికొండ to ఎల్కుర్తి BT రోడ్ ఆనుకొని 1.05 ఎ॥ ఓపెన్ ల్యాండ్ కాంపౌండ్ వాల్ 1 రూం నియర్ నేషనల్ హైవేకు, గోడౌన్స్, స్టాక్ యార్డ్, సర్వీసింగ్ సెంటర్‌కి అనుకూలమైనది లీజు. 7093873666 [W-1220975]

SERVICES

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
■మీయొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు, సెల్: 9849145043. [W-788992]

శ్రీశైలి బ్యూటిపార్లర్
■హన్మకొండలో శ్రీశైలి బ్యూటిపార్లర్‌లో ST మహిళలకు ఉచిత బ్యూటీషియన్ శిక్షణ ఇవ్వబడును. మొదటి 60 మంది మాత్రమే. సంప్ర: 9989060668. [W-1220984]

FINANCE SERVICES
■ సిరి అసోసియేట్స్: అన్ని రకాల ఋణాలు, పర్సనల్, హౌసింగ్, మార్టిగేజ్, ఓపెన్ ప్లాట్స్‌పై కూడా సివిల్ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సెల్: 9666142226. [W-788999]

CHANGE OF NAME
■ I, JULURI RAMESH S/o. JULURI DHANANJAYA (Late), R/o H. No. 6-1-SU0037, Balaji Nager, Suryapet Road, Jangaon, Jangaon district, TS, India. PIN Code: 506167. (New Name and Address). Name changed as JULURI RAMESH instead of JOOLURI RAMESH. [W-789000]

WANTED
■ Delicious Chicken Outlets is looking for Delivery Executives in Warangal. Any Exp. is considered. Salary 10 - 12K + Petrol Allowances. Cont: 8106112401. [W-788998]
■ యువరాజ్ కిరాణంలో పని చేయుటకు కిరాణంలో 3సం॥ చేసిన అనుభవం గల యువతీ యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం. వరంగల్ లోకల్ వారికి మాత్రమే. సంప్ర: అండర్‌బ్రిడ్జి దగ్గర, వరంగల్. 9490133696. [WA-7291]
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ మేనేజ్‌లు పంపుతూ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9502712418, 9030612463 [M-1233787]
■ గుంటూరు వద్ద అడ్వకేట్ ఆఫీసులో ఉండి పని చేయుటకు అనుభవమున్న డ్రైవరు మరియు జూనియర్ లాయరు కావలెను. రూము సౌకర్యం+జీతం 20-25వేలు ✆ 8106719134 / 9346928964 [G-781749]
■ విజయవాడలో A/C & Coolers రెంటల్ (tower-ac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, డోర్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1255218]
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్ కలదు. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9030675274. [M-1233793]
■ రియల్ ఎస్టేట్‌లో మార్కెటింగ్‌కి House Wifes, RTD ఎంప్లాయిస్, Fresh / Exp పర్సన్స్ Male/Female కావలెను. No Age లిమిట్. ఫోన్ 6304914366. [H-801476]
■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899 [H-793691]
■ ఈశ్వర్ హోం కేర్ సర్వీస్ HYD, 24 గం॥ వృద్ధులు, పేషెంట్లు, పిల్లలను చూసుకొనుటకు ఇంటి/వంట పనికి స్త్రీ/పు॥ కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 16,000/- ఫోన్ 8977841099 / 8985115277. [H-787792]

■ Wanted Female Telecallers and Team Leaders for HDFC Bank Credit Card Sales, Office Address: KU Circle, Cont: 9963490087 [WA-5837]
■ జనగామ జిల్లా కేంద్రంలో జూనియర్, డిగ్రీ కళాశాలల్లో & శిక్షణ సంస్థలో విద్యార్థులను అడ్మిషన్స్ చేయడానికి SRO's & Student Executives కావలెను. 9515137392, 9100646845. [WA-7293]
■ TSRTC లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు జెబిఎస్, MGBS & మియాపూర్ డిపోలలో అసిస్టెంట్ మెకానిక్స్, కానిస్టేబుల్స్, ట్రాఫిక్ గైడ్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, వెల్డర్, బస్ స్వీపింగ్ క్లీనింగ్ కావలెను. ఫోన్ 7997104912. [H-801595]
■ ఆటోమేటిక్ కార్ డ్రైవింగ్‌లో అనుభవం ఉన్న డ్రైవర్లు/కర్ణాటక నందు పని చేయుటకు సైట్ సూపర్‌వైజర్లు కావలెను. సంస్థ పేరు: PVC ప్రాజెక్ట్స్, కర్ణాటక, కాల్: 040-23338080, ఇ-మెయిల్: frontdesk.vineela@gmail.com, సంప్రదించు సమయం: Mon-Sat 10am to 5pm [H-788295]
■ బాలాజీ గ్రూప్ (A.P, T.S & న్యూఢిల్లీ నెం-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5000/కమీషన్. 9133271122 / 9052671122. [H-787781]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

భక్తులను క్షేమంగా చేరవేయడమే లక్ష్యం

- రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ శాఖ మంత్రి సీతక్క
- మేడారంలో ఆర్టీసీ బేస్ క్యాంప్ ప్రారంభం

ఏటూరునాగారం/ఎస్ఎస్‌తాడ్వాయి: భక్తులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేడమే ఆర్టీసీ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మేడారంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ బేస్ క్యాంప్, క్యూలైన్‌ను శనివారం ఆర్టీసీ ఉన్నతాధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ నేతృత్వంలో అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారన్నారు. 55 ఎకరాల విస్తీర్ణంలో తాత్కాలిక బస్టాండ్‌తో కూడిన బేస్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బేస్ క్యాంప్‌లో 7 కిలో మీటర్ల పొడవున 50 క్యూ లైన్లను నిర్మించినట్లు వివరించారు.

జంపన్న వాగు పరిసరాల్లో గజ ఈతగాళ్లను ఉంచాలి

మేడారం హరిత హోటల్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జంపన్న వాగు పరిసర ప్రాంతాల్లో గజ ఈతగాళ్లు ఉండేలా చూడాలన్నారు. అలాగే, ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో క్యూ లైన్‌లోని భక్తులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలన్నారు. జాతరలో ఫుడ్‌పాయిజన్ కాకుండా చూడాలన్నారు. ఈ విషయంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల పాత్ర కీలకమన్నారు. మేడారంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులు భక్తులకు తెలిసేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. గద్దెల ప్రాంగణంలో టీటీడీ కల్యాణ మండపంలో 24/7 వైద్య సేవలు అందించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో హెల్త్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ క్రిస్టినా చొంగ్తూ, హెల్త్ డైరెక్టర్ ఆర్‌వీ కర్ణన్, ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ రఘునాథరావు, ఆర్‌ఎం శ్రీలత, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, మేడారం జాతర చైర్మన్ లచ్చుపటేల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలి

సెక్టోరియల్ అధికారులు సమన్వయంతో పని చేసి జాతరను విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. శనివారం మేడారంలోని హరిత హోటల్‌లో నిర్వహించిన నోడల్ అధికారుల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. భక్తులకు సేవ చేస్తే దేవతలకు చేసినట్లేనన్నారు. హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టియానా జెండ్ చొంగ్తూ మాట్లాడుతూ జాతర సమయంలో సెక్టోరియల్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య సేవలతో పాటు భక్తులకు కావాల్సిన సౌకర్యాలు అందించాలన్నారు. జాతరలో అన్ని శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని హెల్త్ డైరెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. జాతరలో అన్ని రకాల పనులు పూర్తి కావొచ్చాయని ఐటీడీఏ పీఓ అంకిత్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు మేడారంలో ఈనెల 19 నుంచి అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు కృష్ణ ఆదిత్య, రాధికాగుప్త, ప్రతిమాసింగ్, ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, ఎస్పీ శబరీశ్, ఆర్‌డీఓ సత్యపాల్‌రెడ్డి, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎండోమెంట్ అధికారులు పాల్గొన్నారు.

మీడియా కీలకపాత్ర పోషించాలి

జాతర విజయవంతంతో మీడియా కీలకపాత్ర పోషించాలని మంత్రి సీతక్క అన్నారు. ఇంగ్లిష్‌మీడియం పాఠశాలలో మీడియా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ రూపొందించిన పుస్తకం, మీడియా టీషర్ట్‌లను కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్‌తో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, సమాచార శాఖ అదనపు డైరెక్టర్ లక్ష్మణ్, డీపీఆర్ఓ రఫీక్, ఏపీఆర్ఓ వేణు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. మహిళా రైతు మృతి

- పొలానికి వెళ్తుండగా ఘటన..



కాల్వలో పడిన ట్రాక్టర్



జయ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: ట్రాక్టర్ బోల్తా పడి ఓ మహిళా రైతు మృతి చెందింది. ఈ ఘటన శనివారం మండలంలోని చంద్రుతండా గ్రామ పంచాయతీ పరిధి మాన్‌సింగ్‌తండాలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన భూక్య రాజు చంద్రుతండా మాజీ సర్పంచ్. ఈ క్రమంలో తమ వరి పొలంలో యూరియా వేయడానికి రాజు, అతడి భార్య జయ (35) ట్రాక్టర్‌లో బయలుదేరారు. రాజు ట్రాక్టర్ నడుపుతుండగా జయ పక్క సీట్లో కూర్చుంది. కాగా, వారి పొలానికి వెళ్లే రోడ్డు పక్కన దేవాదుల కాల్వ ఉంది. ఈ క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి కెనాల్‌లో బోల్తా పడింది. ప్రమాదాన్ని గమనించిన చుట్టుపక్కల రైతులు వెళ్లి చూడగా ట్రాక్టర్ ట్రాలీ కింద పడిన జయ అక్కడికక్కడే మృతిచెందింది. రాజుకు స్వల్ప గాయాలుకాగా వెంటనే 108లో ఘన్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ ముస్కు రాజు ఆధ్వర్యంలో సిబ్బంది శవ పంచనామా నిర్వహించి జయమృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో భూక్య రాజు అజాగ్రత్తగా ట్రాక్టర్ నడిపి ప్రమాదానికి కారణమయ్యాడని మృతురాలి మేనమామ కోబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వరంగల్ శంభునిపేటలో మహిళ, మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారంలో విద్యార్థిని, నర్సంపేటలో వ్యక్తి మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.



నాగజ్యోతి (ఫైల్)

ఖిలా వరంగల్ : ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ శంభునిపేట విశ్వనాథకాలనీలో అద్దెకుంటున్న శివరాత్రి రజినీకాంత్, సిద్దిపేటకు చెందిన నాగజ్యోతి (23) ఎనిమిది ఏళ్ల క్రితం ప్రేమ పెళ్లి చేసుకుని ఇరు కుటుంబాలకు దూరంగా ఉంటున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు పూర్ణిమ, తేజశ్రీ, మరో 2 నెలల చిన్నారి ఉంది. ఈ క్రమంలో దంపతుల మధ్య ఏ సమస్య తలెత్తిందో తెలియదు కానీ నాగజ్యోతి శనివారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సమయంలో రజినీకాంత్ ముగ్గురు పిల్లలతో కలిసి ఇంట్లోనే నిద్రిస్తున్నాడు. నిద్ర నుంచి లేచిచూసే సరికే నాగజ్యోతి ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. గమనించి వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం అందజేయగా, ఎస్సై వెంకన్న హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. అనంతరం వివరాలు సేకరించి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. కాగా, నాగజ్యోతి ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని పోలీసులు తెలిపారు.

ఉద్యోగం రాదనే మనస్తాపంతో విద్యార్థిని..



శిరీష (ఫైల్)

దంతాలపల్లి : ఉద్యోగం రాదని మనస్తాపం చెందిన ఓ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని పెద్దముప్పారంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గాదరబోయిన శిరీష (24) హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌లో హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో ఇటీవల నిర్వహించిన గ్రూప్ -4 పరీక్ష రాసింది. ఫలితాలు విడుదల కాగా, అందులో మార్కులు తక్కువ వచ్చాయి. దీంతో తనకు ఉద్యోగం రాదని మనస్తాపం చెంది శుక్రవారం రాత్రి అదే హాస్టల్‌లో ఉరేసుకుని మృతిచెందింది. ఈ ఘటనపై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నర్సంపేటలో వ్యక్తి..

నర్సంపేట రూరల్ : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నర్సంపేట పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్సై శీలం రవి కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన సూరినేని సంపత్‌రావు (45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల అనారోగ్య సమస్యలు తలెత్తడంతో మనోవేదనకు గురవుతున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం నెక్కొండ రోడ్డులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు మృతదేహాన్ని నర్సంపేట మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు.

క్లుప్తంగా

సరస్వతీ పుత్రుడికి నాలుగు ఉద్యోగాలు


రంజిత్ గౌడ్

నెక్కొండ : వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని సూరిపల్లి గ్రామానికి చెందిన గడ్డం అరుణ–వేణుగోపాల్ దంపతులకు ఇద్దరు కుమారులు. తల్లి వ్యవసాయ కూలీ, తండ్రి గీతకార్మికుడు. పెద్ద కుమారుడు రంజిత్ గౌడ్ స్థానిక హైస్కూల్‌లో పదో తరగతి, ఖమ్మం జిల్లా కొత్తగూడెం పాలిటెక్నిక్‌లో డిప్లొమా, హైదరాబాద్‌లో సివిల్ ఇంజనీరింగ్ చదివాడు. ఏడు నెలల కితం రైల్వే ఇంజనీర్ విభాగంలో టెక్నీషియన్ 4వ స్థాయిలో ఉద్యోగం సాధించాడు. అలాగే పోలీస్ కానిస్టేబుళ్ల ఉద్యోగ నియామకాల్లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. పది రోజుల క్రితం ప్రకటించిన గ్రూప్–4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. అయితే శనివారం ప్రకటించిన టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఫలితాల్లో ఉద్యోగం సంపాదించాడు. తాను కోరుకున్న సివిల్ ఇంజనీర్ విభాగంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఉద్యోగంలో చేరుతానని రంజిత్ గౌడ్ 'సాక్షి'కి తెలిపాడు. ఓ నిరుపేద కుటుంబానికి చెందిన రంజిత్‌గౌడ్ తాను అనుకున్న లక్ష్యం సాధించడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరిశోధనలపై దృష్టిసారించాలి

● బీఐటీ మెస్రా వీసీ ఇంద్రనీల్ మన్నా



కాజీపేట అర్బన్ : సమాజానికి దోహదపడే పరిశోధనలపై రీసెర్చ్ స్కాలర్స్ దృష్టి సారించాలని బీఐటీ వైస్ చాన్స్‌లర్ ఇంద్రనీల్ మన్నా సూచించారు. ఈ మేరకు పోస్టర్ల ద్వారా రీసెర్చ్ స్కాలర్స్ తమ పరిశోధనలను ఇతరులకు స్ఫూర్తినందించేందుకు నిట్‌లో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమని ఇంద్రనీల్ మన్నా తెలిపారు. నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో శనివారం రీసెర్చ్ స్కాలర్స్ కాన్ఫ్లుయన్స్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, ప్రొఫెసర్ శరత్‌బాబు, రాజు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు. అనంతరం నిట్ అల్యూమ్ని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు వద్దకు ఎమర్జెన్సీ బృందం

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని ఖమ్మం–బోనకల్ రైల్వేస్టేషన్ల మధ్య గల చింతకాని రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. కాగా ఈ ఘటన స్థలానికి కాజీపేట జంక్షన్ నుంచి యాక్సిడెంట్ రిలీఫ్ ట్రెయిన్, రైల్వే అధికారులు, సిబ్బందితో కలిసి తరలివెళ్లినట్లు రైల్వే అధికారులు తెలిపారు. చింతకాని వద్ద మెయిన్‌లైన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు ఘటనను కాజీపేట రైల్వే అధికారులు సైరన్ మోతలతో కాజీపేట రైల్వే ఎమర్జెన్సీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. సమాచారం అందుకున్న ఎమర్జెన్సీ అధికారులు, సిబ్బంది హుటాహుటిన కాజీపేట రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే ప్లాట్‌ఫాంపై సిద్ధంగా ఉన్న యాక్సిడెంట్ రిలీఫ్ ట్రెయిన్‌లో రైల్వే అధికారులు, సమారు 50 మంది అత్యవసర సిబ్బంది పట్టాలు తప్పిన గూడ్స్ రైలును సరిచేసేందుకు తరలివెళ్లారు.

ఎత్తు బంగారానికి బారులు



మడికొండ: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర సమీపిస్తుండడంతో భక్తులు ఎత్తు బంగారంతో మొక్కు చెల్లించుకునేందుకు దుకాణాల ఎదుట బారులుదీరుతున్నారు. ఎత్తు బంగారంలో కొంత మొత్తాన్ని వన దేవతలకు చెల్లించి మేడారంలో మొక్కు తీర్చుకుంటున్నారు.

పోలీస్ డ్యూటీ మీట్‌లో విజయ్‌కి గోల్డ్ మెడల్

వరంగల్ క్రైం: ఈనెల 12 నుంచి 16 వరకు లక్నోలో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో వరంగల్ కమిషనరేట్‌కు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ దేశిని విజయ్‌కుమార్ బంగారు పతకాన్ని సాధించారు. తెలంగాణ పోలీస్ బృందం తరఫున పాల్గొన్న విజయ్‌కుమార్ సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్ ఫొటోగ్రఫీ విభాగంలో నిర్వహించిన పోటీల్లో ప్రథముడిగా నిలిచి బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. శుక్రవారం నిర్వహించిన ముగింపు వేడుకల్లో ఆర్‌పీఎఫ్ ఐజీ మనోజ్ యాదవ్ విజయ్‌కుమార్‌కు పతకాన్ని అందజేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా విజయ్‌కుమార్‌ను అభినందించారు.

ఎన్డీకి కలిసిరాని చీలికలు

● అశోక్ అరెస్టుతో దళాల ఉనికి ప్రశ్నార్థకం

బయ్యారం : ఇల్లందు నియోజకవర్గాన్ని కంచుకోటగా మార్చుకొని అనేక విజయాలు సాధించిన న్యూడెమోక్రసీ పార్టీలో వచ్చిన చీలికలు ఆ పార్టీ ఉనికికే ప్రశ్నార్థకంగా మారాయి. పార్టీ చీలికకు ముందు గుమ్మడి నర్సయ్య ఇల్లందు నియోజకవర్గంలో గెలుపొంది చరిత్రను సృష్టించారు. ఈ క్రమంలో సిద్ధాంతపరంగా పార్టీలో వచ్చిన విభేదాలతో 2013వ సంవత్సరంలో పార్టీ చంద్రన్న, యతీంద్రకుమార్ వర్గాలుగా చీలిపోయింది. పార్టీ చీలిన సమయంలో రెండు వర్గాలకు సాయుధ నక్సల్స్ దళాలు సైతం ఉండి కార్యకలాపాలను కొనసాగించాయి.

2016నుంచి కలిసిరాని కాలం..

పార్టీ చీలికల అనంతరం రెండు వర్గాలు తమకు పట్టున్న చోట సాయుధ దళాలను ఏర్పర్చుకొని ఉద్యమాలను కొనసాగించాయి. చంద్రన్నవర్గం అశోక్ ఆధ్వర్యంలో ఖమ్మం–వరంగల్ ఏరియా కమిటీ ఏర్పాటు చేసి దళాలను కొనసాగించగా యతీంద్రకుమార్ వర్గం మధు ఆధ్వర్యంలో నార్త్ ఈస్ట్ రీజనల్ కమిటీ ఏర్పాటు చేసి దళాలను నడిపించే బాధ్యత తీసుకుంది. ఈ క్రమంలో తెలంగాణ ఏర్పడిన తర్వాత యతీంద్రకుమార్ వర్గానికి చెందిన మధును 2016 లో మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో పోలీసులు అరెస్టు చేశారు. దీంతో మొదలైన అరెస్టుల పర్వం రెండుగ్రూపులకు చెందిన గోపి, సాగర్, లింగన్న, వీరన్న, సూర్యం, పుల్లన్న, నరేష్ తదితర దళనాయకుల వరకు కొనసాగింది. ఈ సమయంలో దళంలో మిగిలిపోయిన అశోక్‌ను సైతం పట్టుకునేందుకు అప్పటి మహబూబాబాద్ ఎస్పీ కోటిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో అశోక్ పోలీసులకు చిక్కకుండా అజ్ఞాత జీవితాన్ని గడుపుతున్నారు.

నిర్బంధం తగ్గిందని ప్రజలకు చేరువయ్యేందుకు..

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో బీఆర్ఎస్ పార్టీ పెట్టిన నిర్బంధం తమపై ఉండదని భావించిన ఎన్డీ నాయకులు తిరిగి అటవీప్రాంతంలోని ప్రజలకు చేరువయ్యేందుకు ఇటీవల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బయ్యారం, ఇల్లందు మండలాల ఏజెన్సీ ప్రజలతో సుదీర్ఘ సంబంధాలు ఉన్న చంద్రన్నవర్గం రాష్ట్ర కార్యదర్శి అశోక్ అటవీప్రాంతంలో సంచరిస్తూ ప్రజలను కలిశారనే ప్రచారం ఉంది. ఈ విషయాన్ని పసిగట్టిన పోలీసులు పథకం ప్రకారం అశోక్ కదలికలపై నిఘాపెట్టి పక్కా సమాచారంతో పట్టుకున్నట్లు తెలుస్తోంది.

టార్గెట్‌ను ఆలస్యంగా ఛేదించిన పోలీసులు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిషేధిత మావోయిస్టుల కార్యకలాపాలు తగ్గడం, ఇతర నక్సల్స్ గ్రూపులైన జనశక్తి, ప్రజా ప్రతిఘటన, ప్రతిఘటన పార్టీల దళాలు కనుమరుగవడంతో రాష్ట్రంలో మిగిలి ఉన్న ఎన్డీ దళాలపై పోలీసులు దృష్టి సారించారు. పలుమార్లు చిక్కినట్టే చిక్కి తప్పించుకున్న అశోక్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులు పెట్టుకున్న టార్గెట్‌ను భద్రాద్రి జిల్లా పోలీసులు ఆలస్యంగానైనా పూర్తి చేశారనే ప్రచారం జరుగుతుంది. అశోక్ అరెస్టుతో ఎన్డీలోని ఇరువర్గాలకు చెందిన దళాల ఉనికి ప్రస్తుతం లేకుండా పోయిందని విప్లవ ఉద్యమశ్రేణులు పేర్కొంటున్నారు.


మహబూబాబాద్, భద్రాద్రి జిల్లా సరిహద్దుల్లో గాలింపు చేపడుతున్న పోలీసులు


ఎన్డీ నాయకుల అరెస్టును చూపుతున్న భద్రాద్రి జిల్లా పోలీసులు(ఫైల్)

తప్పించుకున్న దళసభ్యుల కోసం గాలింపు..

అశోక్, గోపన్న అరెస్టు తర్వాత తప్పించుకున్న దళసభ్యుల కోసం పోలీసులు శనివారం మహబూబాబాద్, భద్రాద్రి జిల్లాల సరిహద్దులో గాలింపు చర్యలు చేపట్టారు. అటవీప్రాంతంలో సోదాలు నిర్వహిస్తూ అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. అనేక సంవత్సరాలుగా పోలీసు బూట్ల చప్పుళ్లు లేని గ్రామాల్లో రెండ్రోజులుగా బలగాలు తిరుగుతుండటంతో ఏజెన్సీ ప్రజల్లో ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

సబ్ జూనియర్స్ బాక్సింగ్ ఎంపికలు


తలపడుతున్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్ : హనుమకొండలోని డీఎస్ఏ బాక్సింగ్‌హాల్‌లో శనివారం సబ్ జూనియర్స్ బాల, బాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలురకు 33–35 నుంచి 70 కేజీల వరకు, బాలికల విభాగంలో 31–33 నుంచి 67 కిలోల వెయిట్ కేటగిరీల్లో ఎంపికలు నిర్వహించినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బూజుగుండ్ల రవికుమార్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 21, 22వ తేదీల్లో హైదరాబాద్‌లోని లాలాగూడ రైల్వే ఇనిస్టిట్యూట్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కాగా ఎంపికల నిర్వహణపై పలువురు క్రీడాకారుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రెఫరీలు ఏకపక్షంగా వ్యవహరించారని, గెలిచిన వారిని కాకుండా అనుకూలంగా ఉన్న క్రీడాకారులను విజేతలుగా ప్రకటించారని ఆరోపించారు. ఈ విషయంపై అసోసియేషన్ బాధ్యులకు ఓ క్రీడాకారుడు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బూజుగుండ్ల రవికుమార్‌ను వివరణ కోరగా కొందరు సీనియర్ క్రీడాకారులు గ్రూపులుగా విడిపోయి విభేదాలు సృష్టిస్తున్నారని అన్నారు. ప్రతిభ గల క్రీడాకారులకు సముచిత స్థానం ఉంటుందని, ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని తల్లిదండ్రులకు సూచించారు.

ఘంటసాల స్వరం.. తెలుగుభాషకు వరం

● ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు మహేష్‌బాబు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మహేష్‌బాబు తదితరులు

హన్మకొండ : ప్రముఖ గాయకుడు ఘంటసాల స్వరం.. తెలుగు భాషకు వరమని ఆర్యవైశ్య వేదిక ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు గట్టు మహేష్‌బాబు అన్నారు. ఘంటసాల ఆర్ట్స్ అకాడమీ, సంగీత కళాశాల ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో డాక్టర్ టి.శరత్‌చంద్ర సంగీత సారథ్యంలో రెండు రోజుల పాటు జరిగే ఐడల్ గంధర్వ–2024 కార్యక్రమం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో శనివారం ప్రారంభమైంది. ఈకార్యక్రమానికి గట్టు మహేష్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అంతకు ముందు ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కళల కాణాచి వరంగల్‌లో కళాకారులకు ఘంటసాల పాటలు పాడే అవకాశం కల్పించడం హర్షణీయమన్నారు. తెలుగు సినిమా తొలితరం నేపథ్య గాయకులలో ఘంటసాల ఒకరని గుర్తుచేశారు. ఘంటసాలను, ఆయన పాడిన పాటలు గుర్తు చేసుకునేల ఐడల్ గంధర్వ కార్యక్రమం చేపట్టిన టి.శరత్‌చంద్రను అభినందించారు. అనంతరం శరత్‌చంద్ర మాట్లాడుతూ.. కళాకారుల్లో ప్రతిభ వెలికి తీసి సమాజానికి పరిచయం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఘంటసాల సంగీత కళాశాల ఇంటర్నేషనల్ న్యూజెర్సీ అధ్యక్షుడు అన్నా మధుసూదన్ రావు, మస్కట్ బ్యాంక్ మేనేజర్ గట్టు అరవింద్, ప్రొఫెసర్ తిరుపతయ్య, రంగు రఘుపతి, పుల్లూరు మధు, టి.వి.రమేష్, లక్కిరెడ్డి సంజీవరెడ్డి, సమశ్రీ, మాధవి పాల్గొన్నారు.

రవాణాశాఖలో బదిలీలు

● డీటీసీ, ఎంవీఐ, ఏఎంవీఐలకు స్థానచలనం
● ఉత్తర్వులు జారీచేసిన రవాణాశాఖ కమిషనర్



ఖిలా వరంగల్ : రవాణాశాఖలో ప్రక్షాళనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొదటిసారి ఆశాఖలోని ప్రతి అధికారి బదిలీ అయ్యేలా ప్రత్యేక జీఓ విడుదల చేసింది. అన్ని స్థాయిల్లోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి స్థానచలనం తప్పలేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ అధికారులు(డీటీసీ), 23 మంది రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారులు(ఆర్టీఓ), 150 మంది మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు(ఎంవీఐ), అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు (ఏఎంవీఐ) బదిలీ అయ్యారు. ఇందులో వరంగల్ ఉమ్మడి జిల్లా వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, జనగామ రవాణాశాఖలో భారీ బదిలీలు చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.ఎస్. శ్రీనివాస రాజు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లాల వారీగా బదిలీలు ఇలా..

డీటీసీ పురుషోత్తం హనుమకొండ నుంచి కరీంనగర్, పుప్పాల శ్రీనివాస్ ఆదిలాబాద్ నుంచి హనుమకొండకు.. ఆర్టీఓ రంగారావు వరంగల్ నుంచి పెద్దపెల్లికి, లక్ష్మి ఆసిఫాబాద్ నుంచి వరంగల్‌కు బదిలీ అయ్యారు. ఎంవీఐ కె.వేణు హనుమకొండ నుంచి కరీంనగర్ హుజురాబాద్‌కు, ఎస్.శ్రీనివాసు హనుమకొండ నుంచి వరంగల్‌కు, ఏఎంవీఐ ఫహమా సుల్తానా హనుమకొండ నుంచి ఆదిలాబాద్, ఏఎంవీఐ మాధవి హనుమకొండ నుంచి ఆసిఫాబాద్‌కు, ఏఎంవీఐ స్రవంతి హనుమకొండ నుంచి కరీంనగర్, ఎంవీఐ బి.కిషోర్‌బాబు అశ్వరావుపేట నుంచి హనుమకొండకు, ఎంవీఐ వేణుగోపాల్‌రెడ్డి నిర్మల్ నుంచి హనుమకొండకు బదిలీ అయ్యారు. ఎంవీఐ రమేష్ రాథోడ్ వరంగల్ నుంచి హనుమకొండకు, ఏఎంవీఐ విజయశాంతి అశ్వరావుపేట నుంచి హనుమకొండ, ఎంవీఐ కె.రవీందర్ వరంగల్ నుంచి ఆదిలాబాద్, ఏఎంవీఐ శాలిని వరంగల్ నుంచి ఆసిఫాబాద్, ఎంవీఐ వెంకన్న మహబూబాబాద్ నుంచి జగిత్యాలకు, ఎంవీఐ డి. శ్రీనివాసు ములుగు నుంచి పెద్దపల్లికి, ఎంవీఐ సిరాజ్ రహిమాన్ పెద్దపల్లి నుంచి ములుగు, ఎంవీఐ ఎస్.శ్రీనివాస్ జనగామ నుంచి హైదరాబాద్, ఎంవీఐ టి.జైపాల్‌రెడ్డి భద్రాద్రి కొత్తగుడెం నుంచి మహబూబాబాద్, ఎంవీఐ ఎండి గౌస్‌పాషా ఖమ్మం నుంచి మహబూబాబాద్ బదిలీ అయ్యారు. వీరంతా శనివారం బదిలీ ఉత్తర్వులు అందుకున్నారు.

పెళ్లి పేరుతో మోసం

వరంగల్ క్రైం: పెళ్లి చేసుకుంటానని గర్భవతిని చేసి ముఖం చాటేసిన యువకుడిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. హసన్‌పర్తి మండలానికి చెందిన ఓ వివాహిత అదే మండలానికి చెందిన ప్రశాంత్ అనే యువకుడితో సహజీవనం చేసింది. వీరిద్దరూ హనుమకొండలోని కుమార్‌పల్లిలో అద్దె గదిలో కొంత కాలం ఉన్నారు. పెళ్లి చేసుకుంటానని గర్భవతిని చేసి ముఖం చాటేయడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీశ్ తెలిపారు.

గుణాత్మకతను పెంచేందుకు మానిటరింగ్



విద్యారణ్యపురి: లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం-ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి ప్రోగ్రాం అమలు తీరును నిరంతరం పర్యవేక్షించాలని, గుణాత్మక విద్యను పెంచేందుకు మానిటరింగ్ అవసరమని డీఈఓ అబ్దుల్ హై అన్నారు. హనుమకొండలోని తేజస్వి హైస్కూల్లో పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారులు, పానెల్ ఇన్‌స్పెక్షన్ టీం లీడర్లతో శనివారం జిల్లా స్థాయి సమీక్షలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రాధ, మండల విద్యాశాఖ అధికారులు రామకృష్ణంరాజు, వెంకటేశ్వరరావు, రమాదేవి, రవీందర్, డీసీఈబీ సెక్రటరీ రాంధన్ పాల్గొన్నారు.

భార్య చేతిలో భర్త హతం

● మైసంపల్లిలో ఘటన
● వేధించడంతో ఘాతుకం


రాజు(ఫైల్)

దుగ్గొండి : అగ్నిసాక్షిగా ఏడు అడుగులు నడిచారు. కష్ట సుఖాల్లో జీవితాంతం పాలు పంచుకుంటామని ప్రమాణాలు చేశారు. అయితే చేసిన బాసలన్నీ మరిచిన భార్య చివరికి భర్తను హతమార్చింది. ఈ ఘటన శనివారం ఉదయం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మైసంపల్లి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం గ్రామానికి చెందిన జేరిపోతుల రాజు(48), లక్ష్మి దంపతులు నిరుపేదలు. పొట్టకూటి కోసం ఎక్కడ పని లభిస్తే అక్కడికి వెళ్లి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో రాజు మద్యానికి బానిసై భార్యను నిత్యం వేధించడంతోపాటు అనుమానిస్తూ దూషించేవాడు.

సమ్మక్క పండుగ చేసుకోవడానికి వచ్చి..

పనుల కోసం ఇతర ప్రాంతాల్లో నివాసం ఉండే రాజు కుటుంబం మేడారం జాతర నేపథ్యంలో ఇంటికి చేరుకున్నారు. పెద్దకుమారుడు ప్రశాంత్ హైదరాబాద్‌లో ఉండగా చిన్న కుమారుడు సూర్య, కూతురు మాధవి, అల్లుడు రాకేష్ ఇంట్లోనే ఉన్నారు. పొద్దంతా పండగ చేసుకున్నారు. సాయంత్రం అతిగా మద్యం సేవించిన రాజు.. భార్య లక్ష్మిని దూషిస్తూ రూ. 500 కావాలని అడిగాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఘర్షణ తీవ్రం కావడంతో లక్ష్మి, చిన్నకుమారుడు సూర్య, అల్లుడు రాకేష్, కూతురు మాధవి, మరో బంధువు తరుణ్.. రాజును ఇటుకలతో కొట్టి వైరుతో ఉరివేసి చంపారు.

100 నంబర్‌కు ఫోన్ చేసిన పెద్దకుమారుడు

గొడవ జరుగుతున్న క్రమంలో రాజు హైదరాబాద్‌లో ఉంటున్న పెద్దకొడుకు ప్రశాంత్‌కు ఫోన్‌చేసి తనను చంపేలా ఉన్నారని బోరున విలపించగా ప్రశాంత్ 100 నంబర్‌కు కాల్ చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు అర్ధరాత్రి మైసంపల్లికి వెళ్లి ఇరువురిని మందలించి వచ్చినట్లు తెలిసింది. తెల్లవారుజామున స్థానికులు పరిశీలించగా అప్పటికే రాజు మృతి చెంది ఉన్నాడు. ఈ ఘటనపై మృతుడి పెద్ద కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. భార్య లక్ష్మి, చిన్నకుమారుడు సూర్య, అల్లుడు రాకేష్, కూతురు మాధవి, బంధువు తరుణ్‌పై కేసు నమోదు చేశామన్నారు. కాగా, నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది.

200 కిలోల నల్లబెల్లం, నాటుసారా స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మం జిల్లా మీదుగా తరలిస్తున్న నల్లబెల్లంతో పాటు నాటుసారాను ఎక్సైజ్ ఉద్యోగులు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం ఎక్సైజ్‌స్టేషన్-2, డీటీఎఫ్ సిబ్బంది శనివారం నగర శివారు గుదిమళ్ల, వెంకటగిరి క్రాస్ సమీపాన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన భూక్యా రవి, గుగులోత్ నరేశ్ ఏపీ నుంచి గూడ్స్ కారియర్ వాహనంలో 200 కేజీల నల్లబెల్లం, 20 లీటర్ల నాటుసారా తీసుకొస్తూ పట్టుబడ్డారు. అయితే, తనిఖీలను గుర్తించిన నరేశ్ పారిపోగా రవిని అదుపులోకి తీసుకుని వాహనంతోపాటు నాటుసారా, నల్లబెల్లం సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్, డీటీఎఫ్ సీఐలు చంద్రమోహన్, కరుణశ్రీ, ఎస్ఐ సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలి


మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

● టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ : ప్రతీ ఒక్కరు బాధ్యతగా విధులు నిర్వర్తించి, సమస్యలను గుర్తిస్తూ, వాటికి శాశ్వత పరిష్కార మార్గాలను కనుగొనాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో నాలుగు రోజుల పాటు మీటర్ రిలే టెస్టింగ్‌పై నిర్వహించిన విద్యుత్ ఉద్యోగుల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి వరుణ్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎప్పటికప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను గమనిస్తూ వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ అందించాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వి.తిరుపతి రెడ్డి, బి.అశోక్ కుమార్, టి.సదర్‌లాల్, వి.మోహన్‌రావు, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, సీజీఎంలు సి.ప్రభాకర్, టి.మధుసూదన్, అశోక్, కిషన్, రాజు చౌహాన్ పాల్గొన్నారు.

బీసీ కులగణనతో సమగ్రాభివృద్ధి

● తెలంగాణ ఉద్యమకారుల చైర్మన్ ఆచార్య కె.వెంకటనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటనారాయణ

కేయూ క్యాంపస్ : తెలంగాణలో బీసీల కులగుణనతో సమగ్రాభివృద్ధి సాధ్యమని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల చైర్మన్, బీసీ కులాల ఐక్యవేదిక బాధ్యులు ఆచార్య కూరపాటి వెంకటనారాయణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల కులగణనకు ముందుకు రావడం, అందుకు శాసనసభలో తీర్మానం చేయడం ఆహ్వానించదగిన విషయమని వెంకటనారాయణ అన్నారు. శనివారం కేయూలోని దూర విద్యాకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1931లో జనగణన చేపట్టారని ఆ తర్వాత బీసీల కులగణన చేయలేదన్నారు. బీసీల కోసం చాకలి ఐలమ్మ, సర్దార్ పాపన్న, కొండా లక్ష్మణ్‌బాపూజీ లాంటి మహనీయులు పోరాడారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఎన్నికల ప్రచారంలో జాతీయ స్థాయిలోను బీసీల కులగణన జరగాలని ఆకాంక్షించారన్నారు. అలాగే రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఇక్కడ కూడా బీసీ కులగణన చేపడతామని హామీ ఇచ్చారని, రేవంత్‌రెడ్డి బీసీ సమగ్ర కులగణనకు కట్టుబడి ఉన్నామని ప్రకటించి శాసనసభలో ఆమోదింపచేయడం అభినందనీయమన్నారు.బీసీ కులగణన జరిగి చట్టబద్ధత కల్పిస్తే వారికి విద్యా, ఉద్యోగ, రాజకీయరంగాల్లో దక్కాల్సిన వాటా దక్కుతుందన్నారు.75ఏళ్ల స్వాతంత్ర్య దేశంలో మండల్ కమిషన్ ద్వారా రాష్ట్రంలో బీసీలు రిజర్వేషన్లు అమలు జరుగుతున్నాయన్నారు. బీసీ కులగణనకు రేవంత్‌రెడ్డిని ఒప్పించడంలో సఫలీకృతులైన రాష్ట్రమంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. కేయూ మాజీ రిజిస్ట్రార్, రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సదానందం మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయన్నారు. బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు పూలే ఆశయసాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర కులగణనకు నిర్ణయం చారిత్రకమని కొనియాడారు. సమావేశంలో వడ్డెర రవీందర్, శ్రీనివాస్‌గౌడ్, దయ్యాల సుధాకర్, బుట్టి శ్యామ్, డాక్టర్ వీరాచారి, శ్రీనివాస్, శివనాగయ్య, చాగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా తొలుత దూర విద్యాకేంద్రంలోని జ్యోతిరావు, సావిత్రిబాయిపూలే విగ్రహాలకు ఆయా బాధ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లపై విచారణ

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ రెండో కేటగిరీలో అడ్మిషన్లు కల్పించిన విషయం విదితమే. అయితే అడ్మిషన్లలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు అందడంతో త్రిసభ్య విచారణ కమిటీ శనివారం కేయూలో విచారించింది. కమిటీలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ వెంకటరమణ, సీపీగేట్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి, టెక్నికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఉన్నారు. తొలుత వీసీ ఆచార్య తాటికొండ రమేష్‌తో పీహెచ్‌డీ అడ్మిషన్ల వ్యవహారంపై కొద్దిసేపు చర్చించారు. అనంతరం డీన్లతో కూడిన సమావేశంలో ఏఏ విభాగాల్లో ఎన్ని సీట్లకు నోటిఫికేషన్ ఇచ్చారు.. ఎన్ని సీట్లు భర్తీ చేశారనే వివరాలను సోషల్ సైన్స్ డీన్ ఆచార్య టి.మనోహర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిటీకి వివరించారు. వివిధ విభాగాల డీన్లు సైన్స్ డీన్, రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, 'లా' డీన్ శ్రీనివాస్, కామర్స్ డీన్ అమరవేణి, ఆర్ట్స్ డీన్ ఆచార్య బన్న అయిలయ్య, ఫార్మసీ కళాశాల మాజీ డీన్ వై.నర్సింహారెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సదానందం, ఎడ్యుకేషన్ విభాగం డీన్ రాంనాథ్ కిషన్ పాల్గొన్నారు.

పీహెచ్‌డీలో సీటురాని అభ్యర్థులతో, వివిధ విద్యార్థి సంఘాలతో..

కేయూలోని సెనేట్ హాల్‌లో పీహెచ్‌డీ సీటురాని అభ్యర్థులు, వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులతో త్రిసభ్య కమిటీ విచారణ చేసింది. యూనివర్సిటీ అధికారులు తమకు ఇష్టం ఉన్న వారికే సీట్లు కేటయించారని కమిటీ ఎదుట ఆరోపించారు.

విచారణ కమిటీ ఎదుట పలు అంశాలు..

స్టాండింగ్ కమిటీలో ఆమోదం పొందని మార్గదర్శకాలతో పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించారని, అడ్మిషన్లలో యూజీసీ మార్గదర్శకాలు బేఖాతర్ చేశారని కూడా తెలియజేశారు. ఎక్కువగా పార్ట్‌టైం అభ్యర్థులకే అడ్మిషన్లు కల్పించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాచెర్ల రాంబాబు, అంబాల కిరణ్, పాషా, అంకెల్ల శంకర్ తదితరులు మాట్లాడారు. యూజీసీ నిబంధనలు, యూనివర్సిటీ మార్గదర్శకాల ప్రకారం.. ఒక విద్యా సంవత్సరంలో పీహెచ్‌డీ కేటగిరీ–1కింద ఖాళీగా ఉన్న సీట్లు ఏవైనా ఉంటే అదే విద్యా సంవత్సరంలో పీహెచ్‌డీ కేటగిరీ–2కి బదిలీ చేయబడతాయి. అయితే, కేటగిరీ–1 ఖాళీ సీట్లను కేటగిరీ–2కి బదిలీ చేయకుండా యూనివర్సిటీ అధికారులు పీహెచ్‌డీ అడ్మిషన్ల ఇంటర్వ్యూలను పూర్తి చేసారని ఆరోపించారు. స్టాండింగ్ కమిటీలో డీన్స్ ఆమోదం పొందని మార్గదర్శకాల ఆధారంగా పీహెచ్‌డీ కేటగిరీ–2 నోటిఫికేషన్, పరీక్షల నిర్వహణ, ఇంటర్వ్యూల నిర్వహణ, ఫలితాల విడుదల, అడ్మిషన్లు జరిగాయని ఇలాంటి అడ్మిషన్లు చెల్లుతాయా? అని కమిటీ సభ్యులను ప్రశ్నించారు. వివిధ విభాగాల అడ్మిషన్లలో అక్రమాలు జరిగాయని విచారణ కమిటీకి పలువురు తెలియజేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలీఉల్లాఖాద్రి, యూత్ కాంగ్రెస్ బాధ్యుడు ఆలువాల కార్తీక్, కేయూ రిటైర్డ్ ఆచార్యులు గాదె దయాకర్ తదితరులు పాల్గొని కమిటీకి అన్యాయంపై వివరించారు. అనంతరం వినతిపత్రాలు స్వీకరించారు. కమిటీ తమ నివేదికను త్వరలో ప్రభుత్వానికి నివేదించనుంది.


వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

డాక్యుమెంట్స్ అడిగిన విచారణ కమిటీ

కేయూలోని వివిధ విభాగాల పీహెచ్‌డీ కేటగిరీ–2 ప్రవేశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్ష ఫలితాల మెరిట్ లిస్టు, అనంతరం ఇంటర్వ్యూలలో ఆయా అభ్యర్థులకు వచ్చిన మార్కులతో కలిపి ఓవరాల్ మెరిట్ లిస్టు తదితర పత్రాలను త్రిసభ్యవిచారణ కమిటీ డీన్‌లను అడిగినట్లు సమాచారం. అందుకు సంబంధించి విభాగాల వారిగా ఆయా డీన్‌లు వివరాలను కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డికి అందజేశారు. ఒకటి, రెండ్రోజుల్లో ఆయా డాక్యుమెంట్లను కమిటీకి మల్లారెడ్డి హైదరాబాద్‌కు పంపనున్నారని సమాచారం. పీహెచ్‌డీ కేటగిరీ–1 ప్రవేశాల తర్వాత మిగిలిన ఖాళీలను ఎందుకు పీహెచ్‌డీ–2 కేటగిరీలో కలపలేదని కూడా త్రిసభ్య విచారణ కమిటీ డీన్‌లను అడిగింది. సీసీ కెమెరాల నిఘాలోనే ఇంటర్వ్యూలు నిర్వహించామని అందుకు సంబంధించిన రికార్డులు సైతం ఉన్నట్లు తెలిపారు. కాగా పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియపై విచారణ కమిటీ బృందం రావడంతో యూనివర్సిటీ పరిపాలన భవనం, సెనేట్ హాల్ వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

యూజీసీ నిబంధనలు బేఖాతర్

అన్ని అర్హతలు ఉన్నా.. యూనివర్సిటీ న్యాయ (లా) కళాశాల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎన్.సుదర్శన్‌కు ఉద్దేశపూరితంగా వీసీ, రిజిస్ట్రార్లు రెండేళ్లుగా పీహెచ్‌డీ గైడ్ షిప్ ఇవ్వడం లేదని, పీహెచ్‌డీ విద్యార్థులను సూపర్‌వైజర్‌లకు కేటాయించడంలో యూజీసీ నిబంధనలు పాటించడం లేదని అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్(అకుట్) జనరల్ సెక్రటరీ డా.మామిడాల ఇస్తారి శనివారం కేయూలో త్రిసభ్య విచారణ కమిటీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇస్తారి మాట్లాడుతూ.. పీహెచ్‌డీ గైడ్‌షిప్‌నకు అన్ని అర్హతలు ఉన్నా డాక్టర్ సుదర్శన్‌కు గైడ్‌షిప్ ఇవ్వకపోవడం సరికాదని ఆయన పేర్కొన్నారు. యూజీసీ 2022 సెక్షన్ 6:3 ప్రకారం ఒక ప్రొఫెసర్ వద్ద ఎనిమిది మంది, అసోసియేట్ ప్రొఫెసర్ వద్ద ఆరుగురు, అసిస్టెంట్ ప్రొఫెసర్ వద్ద నలుగురు పీహెచ్‌డీ విద్యార్థులు ఉండాలన్నారు. కాగా అంతకంటే ఎక్కువగా విద్యార్థులను కేటాయించారని ఆరోపించారు.